క్లుప్తంగా

కామాక్షితాయి సేవలో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని విశ్రాంత న్యాయమూర్తి సీతారామ్మూర్తి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. తొలుత లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు చేశారు. వీరిని శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు అంగన్‌వాడీలు సన్నద్ధమవ్వాలి



మాట్లాడుతున్న రెహనాబేగం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సమస్యల పరిష్కారానికి గానూ పోరాటాలకు అంగన్‌వాడీ కార్మికులు సిద్ధపడాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రెహనా బేగం పిలుపునిచ్చారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో గల జక్కా వెంకయ్య మెమోరియల్ హాల్లో శుక్రవారం నిర్వహించిన అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మహాసభలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలను ప్రభుత్వోద్యోగులుగా చూపుతూ ప్రభుత్వ పథకాలను అందించడం లేదని ఆరోపించారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూలై తొమ్మిదిన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 20 మందితో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా రజని, కామాక్షి, ట్రెజరర్‌గా మల్లెమ్మ ఎన్నికయ్యారు. సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, నాగేశ్వరరావు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాతమ్మ, ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ, నగరాధ్యక్ష, కార్యదర్శులు పద్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ భద్రతపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. విద్యుత్ భద్రత వారోత్సవాలపై నగరంలోని విద్యుత్ భవన్‌లో అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ ఎనర్జీ – సేవ్ నేషన్ అనే నినాదంతో కార్యక్రమాన్ని జూలై రెండు వరకు నిర్వహించనున్నామని చెప్పారు. అధునాతన సాంకేతిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, ఎలక్ట్రికల్ వాహనాలకు చార్జింగ్ స్టేషన్లు, రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటులో భద్రత ప్రమాణాలకు ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు. నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, ఈఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారి సన్నిధిలో పూజలు



నెల్లూరు(బృందావనం): ఆషాఢమాస శుక్రవారాన్ని పురస్కరించుకొని నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి విశేష పూజలను శుక్రవారం నిర్వహించారు. రాహుకాల పూజలకు 37 మంది హాజరై.. అమ్మణ్ణికి చీర, జాకెట్టు, 108 నిమ్మకాయల మాలలను సమర్పించారు. వేదపారాయణం, సంధ్యామేళం, కుంభహారతులు, పల్లకిసేవను జరిపారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

యువకుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): యువకుడు అదృశ్యమైన ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటలోని చేపల మార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న బహదూర్‌కు ముగ్గురు కుమారులు, కుమార్తె సంతానం. మానసికంగా అనారోగ్యంతో బాధపడుతున్న మూడో కుమారుడు గోవింద్ హిమేర్ ఇంట్లోంచి ఈ నెల 19న బయటకెళ్లారు. అప్పటి నుంచి ఆయన జాడ తెలియరాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లేఅవుట్లలో పబ్లిక్ స్థలాలకు ఎసరు

- గతంలో విజిలెన్స్ విచారణ
- పంచాయతీకి రూ.కోట్ల శఠగోపం
- పరిసర ప్రాంతాల్లో 69 లేఅవుట్లు
- నుడాలో విలీనమైనా ఆగని అక్రమాలు
- నిద్రావస్థలో అధికార యంత్రాంగం



పొదలకూరు పంచాయతీ పరిధిలో పాత లేఅవుట్

పొదలకూరు: పొదలకూరు పరిసర ప్రాంతాల్లో వేసిన లేఅవుట్లలో ప్రజాప్రయోజనాల కోసం పంచాయతీలకు కేటాయించిన స్థలాలకు కొందరు ఎసరు పెడుతున్నారు. అక్రమ లేఅవుట్లు వేసిన వారు ఆ స్థలాలను సైతం అమ్మకాలకు పెడుతున్నట్టు తెలిసింది. రూ.కోట్లు విలువైన లేఅవుట్లలోని ప్రజాప్రయోజనాల స్థలాలను ఆయా పంచాయతీలు స్వాధీనం చేసుకోలేకపోయాయి. లేఅవుట్ అప్రూవల్ కాకపోవడం కూడా ఇందుకు కారణంగా కనిపిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విషయంలో అధికార యంత్రాంగం మిన్నకుంటున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాక అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఇల్లు నిర్మించుకునేందుకు పంచాయతీ అప్రూవల్‌కు వెళితే చేదు అనుభవం ఎదురవుతోంది. వ్యక్తిగతంగానైనా ప్లాట్‌కు పంచాయతీ అప్రూవల్ చేసుకోవాలని అధికారులు వెల్లడించి ఈ ప్రక్రియను చేశారు. అయితే దీని వల్ల గతంలో ఇక్కడ పంచాయతీ సెక్రటరీగా పనిచేసిన ఎస్‌కే అల్లాభక్షు సెస్పెన్షన్‌కు గురి కావాల్సి వచ్చింది.

ఎంతో మంది

పొదలకూరు పరిసర ప్రాంతాల్లో 69 వరకు లేవుట్లు ఉన్నాయి. మండలం నుడాలో విలీనం కావడంతో రూ.కోట్లు ఆదాయం రావాల్సి ఉంది. పొదలకూరు పట్టణ పరిసర ప్రాంతాల్లో 2006 నుంచి 2010 వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఉప్పెనలా వచ్చి రూ.కోట్లు వెచ్చించి పొలాలు కొనుగోలు చేసి లేఅవుట్లు వేశారు. అప్పట్లో ప్లాట్లు టోకెన్ అడ్వాన్సులతోనే పలువురి చేతులు మారుతూ వచ్చాయి. చివరగా వాటిని కొనుగోలు చేసిన వారు ఇబ్బందులు పడ్డారు.

అప్రూవల్ లేక..

అప్రూవల్ లేని లేఅవుట్లలో ఇష్టానుసారం అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ పడిపోయినప్పటికీ ఇల్లు నిర్మించుకుని కాపురాలు ఉండాలనుకునే వారు ప్లాట్లను కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికీ అప్రూవల్ పొందని లేఅవుట్లలో కొందరు అక్రమంగా అమ్మకాలు సాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం లేఅవుట్ వేసేవారు 10 శాతం స్థలాన్ని బడి, గుడి, ఇతర ప్రజాప్రయోజనాల కోసం నుడాకు అప్పగించాలి. ఆ మేరకు వారికి రిజిస్ట్రేషన్ చేయించాలి. అయితే రోజులు జరిగిన తర్వాత గుట్టుచప్పుడు కాకుండా ప్రజాప్రయోజనాల కోసం కేటాయించిన స్థలాలను కూడా అమ్ముకుంటున్నారు. గతంలో పొదలకూరులోని ఓ లేఅవుట్‌లో 300 అంకణాలు, మరో లేఅవుట్లో 282 అంకణాల స్థలాన్ని అమ్ముకోవడంతో వివాదాలు చోటు చేసుకుని న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఇప్పుడు కొత్తగా మరో లేఅవుట్లో పబ్లిక్ స్థలాన్ని కబ్జా చేస్తున్నట్టు సోషల్ మీడియాలో వైరలవుతోంది.

విజిలెన్స్ విచారణ

పొదలకూరు పరిసర ప్రాంతాల్లో వేసిన లేఅవుట్లపై 2015 ఆగస్టులో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సమగ్ర విచారణ నిర్వహించింది. 27 లేఅవుట్లకు డిస్ట్రిక్ట్ టౌన్ అండ్ కంట్రీ ప్లాన్ లేదని నిగ్గుతేల్చింది. నివేదికను ప్రభుత్వానికి సమర్పించడంతో ఇలాంటి లేఅవుట్ల అన్నింటిపై జీఓ నంబర్ 12ను తీసుకువచ్చింది. దీనిప్రకారం డీటీసీపీ లేని లేఅవుట్ల నుంచి రిజిస్ట్రేషన్ వాల్యూ ప్రకారం పంచాయతీలు 14 శాతం నగదు వసూలు చేసి ప్లాన్ అప్రూవల్ చేయాల్సిందిగా సూచించింది. ఇందులో బిల్డింగ్ ప్లాన్‌కు 1 మీటర్‌కు రూ.10 పంచాయతీలకు చెల్లించాల్సి ఉండగా అక్రమ లేఅవుట్లలో నిర్మించే ఇళ్లకు ఒక మీటరుకు రూ.20 వంతున వసూలు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొంది. తర్వాత నుడా విలీనానికి ముందు తర్వాత మరో 40 లేఅవుట్ల వరకు పరిసర ప్రాంతాల్లో వెలిశాయి. వీటిలో అనుమతుల్లేనివి అధికంగా ఉన్నాయి. ఇష్టానుసారం లేఅవుట్లను నిర్మించి ప్లాట్లను కూడా విక్రయించడంతో కొనుగోలు చేసిన వారు ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా నుడా స్పందించి అన్నింటిపై విచారణ నిర్వహించి అనుమతుల్లేని లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులను కూడా పెట్టించారు. అయితే అప్పటికే వారు చాలా ప్లాట్లను అమ్ముకున్నట్టు తెలుస్తోంది.

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు అంకయ్య

ముత్తుకూరు(పొదలకూరు): ముత్తుకూరు మేజర్ పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు నెలనెలా జీతాలు చెల్లించాలని శుక్రవారం సీఐటీయూ నాయకులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం అంకయ్య మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు పదేళ్లుగా పనిచేస్తున్నట్టు తెలిపారు. వారికి సక్రమంగా జీతాలు చెల్లించడం లేదన్నారు. వెంటనే పంచాయతీ సెక్రటరీ ద్వారా జీతాలందేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

గిరిజనులకు అవగాహన



డ్రమ్ములను పరిశీలిస్తున్న అధికారులు

ముత్తుకూరు(పొదలకూరు): స్టాప్ డయేరియా, డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కృష్ణపట్నం రొయ్యల గుంతల ప్రాంతంలో గిరిజనులకు వైద్యాధికారి దేవికృప అవగాహన కల్పించారు. దోమలను నివారించే విధానాలు, వాటివల్ల వచ్చే జబ్బులను వివరించారు. డయేరియా రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ షకూర్, నిర్మలమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన ర్యాలీ



కొడవలూరు: ఫ్రైడే.. డ్రైడేలో భాగంగా మండలంలోని నార్తురాజుపాళెంలో కీటక జనిత వ్యాధులపై అవగాహన ర్యాలీని కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి నాగరాజు మాట్లాడారు. డ్రైడే.. ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి.. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. మురుగునీటి నిల్వలు, చెత్తా చెదారాల్లేకుండా చూడాలని సూచించారు. అనంతరం లార్వా ఉత్పత్తయ్యే ప్రదేశాలను గుర్తించి నిర్వీర్యం చేశారు. హెచ్ఏ షఫీవుద్దీన్, ఎమ్మెల్‌హెచ్‌పీ స్నేహ, ఏఎన్ఎంలు హిమజకుమారి, సలోమి, ఆశ కార్యకర్తలు సరళ, శోభ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఉద్యోగోన్నతి, బదిలీపై వెళ్తున్న వారిని శుక్రవారం సత్కరించారు. ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న భారతి, మంజుల, చంద్రమౌళి, నరేంద్ర, నాగ మల్లికార్జున, బాబునాయుడు హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతి పొందగా, రఫీ అహ్మద్, కమల రత్నం, సుధారాణి, మాధురి, బోధనేతర సిబ్బందిగా పనిచేస్తున్న మంజుల వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. దీంతో వీరిని హెచ్ఎం ఓబులేసు సన్మానించారు.

పాతకక్షలతో ఇరువర్గాల దాడి



చికిత్స పొందుతున్న నవీన్

విడవలూరు: పాతకక్షల నేపథ్యంలో ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్న ఘటన రామచంద్రాపురంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రామతీర్థంలో రామలింగేశ్వరుడి ఉత్సవాల్లో భాగంగా తెప్పోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ క్రమంలో పాతూరుకు చెందిన కొందరు ఓ షాపు వద్ద కూల్‌డ్రింక్స్ తాగసాగారు. రామలింగాపురానికి చెందిన వ్యక్తులు రాగా, ఎందుకొస్తున్నారని, ఇంకోసారి వస్తే సహించేదిలేదని పాతూరు గ్రామస్తులు చెప్పారు. దీంతో ఇరువర్గాలు వాగ్వాదానికి దిగి దాడికి పాల్పడి వెళ్లిపోయారు. మరుసటి రోజు సాయంత్రం ఇరు గ్రామాలకు చెందిన పెద్దలు పాతూరులో పంచాయితీ పెట్టారు. ఇదే సమయంలో ఫోన్ రావడంతో ఎవరికీ చెప్పకుండా రామలింగాపురం వాసులు వెళ్లిపోయారు. ఈ తరుణంలో పాతూరుకు చెందిన కొందరు మహిళలు అక్కడికి చేరుకొని, తమ గ్రామానికి చెందిన నలుగుర్ని రామలింగాపురం గ్రామస్తులు బలవంతంగా తీసుకెళ్లారని చెప్పారు. దీంతో అక్కడికి చేరుకోవడంతో, పరస్పర దాడులు జరిగాయి. సమాచారం అందుకున్న సీఐ సురేంద్రబాబు, విడవలూరు, కొడవలూరు ఎస్సైలు నరేష్, కోటిరెడ్డి తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం గాయపడిన వ్యక్తులను చికిత్స నిమిత్తం నెల్లూరులోని హాస్పిటల్‌కు తరలించారు. కొందరిపై కేసు నమోదు చేశారు. పాతూరుకు చెందిన శివరామ్, రామలింగాపురానికి చెందిన నవీన్ నెల్లూరులోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

పొదలకూరుకు తలశిల రఘురామ్ రాక నేడు

పొదలకూరు: ఎమ్మెల్సీ, మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రోగ్రామ్స్ కో – ఆర్డినేటర్ తలశిల రఘురామ్ శనివారం ఉదయం 10 గంటలకు పొదలకూరుకు విచ్చేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు రోడ్డులోని జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ నివాసంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారని వెల్లడించారు.

వీఎస్‌యూలో జాబ్‌మేళా

వెంకటాచలం: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సోమిరెడ్డి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ప్రాంగణంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. దీనికి 1,403 మంది హాజరుకాగా, వారిలో 438 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పొదుపు మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని మెప్మా పీడీ లీలారాణి పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మెప్మా సమావేశంలో ఆమె మాట్లాడారు. విధి నిర్వహణలో ఆర్పీలు కచ్చితంగా ఉండాలని కోరారు. పట్టణంలో తృప్తి క్యాంటీన్‌ను త్వరలో ప్రారంభించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కమిషనర్ బాలకృష్ణ, చైర్‌పర్సన్ సుప్రజ, సీఎంఎం అంకయ్య, మెప్మా సీఈఓ నర్మద తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సామూహిక సెలవు నేడు



ఇందుకూరుపేట: తమపై ప్రభుత్వం మోపుతున్న అదనపు పనిభారం, ఒత్తిడిని వ్యతిరేకిస్తూ పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవును శనివారం పాటించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ నాగేంద్రబాబుకు నోటీసను శుక్రవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. అదనపు పనిభారాన్ని తొలగించాలని కోరారు.

రెడ్డిపాళెంలో వికసిత్ భారత్



ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నేతలు, గ్రామస్తులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని మునులపూడి పంచాయతీ రెడ్డిపాళెంలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని బీజేపీ నేతలు శుక్రవారం నిర్వహించారు. వికసిత్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. బీజేపీ రూరల్ అధ్యక్షుడు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పైలట్ ప్రాజెక్ట్ కింద 250 పంచాయతీలు

- జెడ్పీ సీఈఓ మోహన్‌రావు



గ్రామస్తులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

పొదలకూరు: చెత్త సేకరణ, పారిశుధ్య చర్యలకు సంబంధించి జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద 250 పంచాయతీలను ఎంపిక చేసినట్టు జెడ్పీ సీఈఓ మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని ఆర్‌వై పాళెం పంచాయతీలో చెత్త సేకరణ, తడిచెత్త, పొడి చెత్త వేర్వేరుగా అందజేసే ప్రక్రియపై శుక్రవారం సీఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపిక చేసిన పంచాయతీల్లో 50 నుంచి 60 శాతం చెత్తను సేకరిస్తున్నారన్నారు. ఆర్‌వై పాళెం పంచాయతీలో 33 శాతమే సేకరిస్తున్నట్టు వెల్లడించారు. అందువల్లే పంచాయతీని పరిశీలించేందుకు విచ్చేసినట్టు చెప్పారు. ఇక్కడ మంచినీటి ట్యాంకులను శుభ్రం చేస్తున్నారని, అయితే చెత్తసేకరణలో వెనుకబడి ఉన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణకు సహకరించాల్సిందిగా గ్రామస్తులకు సూచించారు. తడి చెత్త, పొడిచెత్తను వేర్వేరుగా పంచాయతీ సిబ్బందికి అందజేయాల్సిందిగా పేర్కొన్నారు. ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాడైన ట్రై సైకిళ్లను వెంటనే మరమ్మతులు చేయించి చెత్తను సేకరించాల్సిందిగా వెల్లడించారు. ఇదే పంచాయతీ మజరా గ్రామం అంకుపల్లిలో చెత్తను సేకరించడం లేదన్నారు. చెత్త సేకరణకు సంబంధించి పంచాయతీరాజ్ కమిషనరేట్ నుంచి ఐవీఆర్ఎస్ కాల్స్ చేస్తారని పంచాయతీలో పారిశుధ్యం మెరుగుపర్చుకుని వారికి సమాధానం చెప్పాల్సిందిగా పేర్కొన్నారు. సీఈఓ వెంట ఎంపీడీఓ డీవీ నరసింహారావు, సర్పంచ్ దేవరపాటి పెంచలమ్మ, వెంకటేశ్వర్లు, సెక్రటరీ తదితరులు ఉన్నారు.

ఆక్రమణలో ఉన్న పాఠశాల స్థలాన్ని కాపాడండి

- తహసీల్దార్‌కు టీచర్ల వినతిపత్రం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీచర్లు

పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలిక పాఠశాలకు చెందిన స్థలం ఆక్రమణకు గురవుతోందని, దానిని కాపాడాల్సిందిగా శుక్రవారం టీచర్లు తహసీల్దార్ బి.శివకృష్ణయ్యకు రాతపూర్వకంగా వినతిపత్రాన్ని సమర్పించారు. ముందుగా టీచర్లలంతా కలిసి స్థలాన్ని శుభ్రం చేస్తున్న వారితో వాగ్వాదానికి దిగి తహసీల్దార్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ వీఆర్వో మస్తానయ్యను స్థలం వద్దకు పంపి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. అయితే బోర్డును కూడా తొలగించే ప్రయత్నం చేయడంతో టీచర్లు శివకృష్ణయ్యకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు స్థలం వద్ద మాట్లాడుతూ ఏప్రిల్ 21వ తేదీన అప్పటి జెడ్పీ సీఈఓ మండల సర్వేయర్ ద్వారా కొలతలు వేయించి దుకాణాలు నిర్మించే ప్రయత్నం చేస్తున్న స్థలం పాఠశాలకు చెందిందని, ముందు భాగం ఆర్‌అండ్‌బీ స్థలంగా తేల్చినట్టు తెలిపారు. ఇందుకు సంబంధించి స్కూల్ ప్రాంగణంలో నిర్మించిన కట్టడాలను వారంరోజుల్లో తొలగించాల్సిందిగా పంచాయతీ సెక్రటరీ వద్ద సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్టు వెల్లడించారు. ఈ నేపథ్యంలో తిరిగి కట్టడాలు నిర్మించే యత్నం చేస్తున్న వారు వేపచెట్టు కొమ్మలను తొలగించడమే కాక స్థలంలో మట్టి తొలగించడం, శుభ్రం చేయడం వంటి పనులు చేస్తున్నారని తెలిపారు. అప్పట్లో సీఈఓ బడికి సంబంధించిన స్థలం 2.80 ఎకరాలు కాగా ఇందులో 6 సెంట్లు ఆక్రమణలో ఉన్నట్టు గుర్తించారు. రికార్డుల ప్రకారం పాఠశాల స్థలాన్ని వెంటనే సర్వే చేసి స్కెచ్ అందజేయాల్సిందిగా సీఈఓ ఆదేశించారు. ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తులకు పంచాయతీ సెక్రెటరీ ద్వారా నోటీసులను ఇప్పించారు. సరైన వివరణ ఇవ్వకుండా ఆధారాలు చూపకుంటే అక్రమణలను తొలగించాల్సిందిగా ఆదేశించారు. అయితే నోటీసులు అందజేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. తిరిగి పాఠశాల స్థలం ఆక్రమణపై వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. తహసీల్దార్ శివకృష్ణయ్య స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు.

నగదు లెక్కలు తెలియజేయాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న ప్రమీలమ్మ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీకి సంబంధించిన నగదు లెక్కలను చూపాలని 16వ వార్డు కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ కోరారు. ఈ మేరకు కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం ఆమె మాట్లాడారు. నగర పంచాయతీకి సాధారణ నిధులు జనవరి నుంచి ఎంత జమయ్యాయి.. వివిధ కాంప్లెక్స్‌లకు సంబంధించిన వేలంలో వచ్చిన ఆదాయ వివరాలను తెలియజేయాలని కోరారు. శనివారం నిర్వహించనున్న నగర పంచాయతీ సర్వసభ్య సమావేశంలో వీటిని తెలియజేయాలని విన్నవించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పుస్తకాల పంపిణీ



కొడవలూరు: మండలంలోని రామన్నపాళెం అంగన్‌వాడీ కేంద్రం – 3లో ఐసీడీఎస్ కొడవలూరు సెక్టార్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సెక్టార్ పరిధిలోని 30 అంగన్‌వాడీ కేంద్రాలకు పీపీ – 1, 2 పుస్తకాలను సూపర్‌వైజర్ నిర్మల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలను రోజూ నిర్వహించి పుస్తకాలను పిల్లలతో రాయించాలని కోరారు.

సమస్యలపై క్షేత్ర సందర్శన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సుబ్బారావు

కొడవలూరు: మండలంలోని రామన్నపాళెంలో ఎంపీడీఓ వెంకటసుబ్బారావు క్షేత్ర సందర్శనను శుక్రవారం జరిపి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బంది పనితీరుపై ఇంటింటికీ వెళ్లి ఆరాతీశారు. స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకోవడంతో పాటు పంచాయతీ సిబ్బంది పనితీరును పరిశీలించనున్నానని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్, కాకి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్యక్రమాలపై సమీక్ష



మాట్లాడుతున్న అనిత

కోవూరు: కోవూరు డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులతో సమావేశాన్ని వ్యవసాయ సంచాలకులు అనిత శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు. పంటల బీమా ప్రాధాన్యాన్ని తెలియజేశారు. శశిధర్, శ్రీహరి, రజని, విజయలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న వెంకటశేషయ్య

ఇందుకూరుపేట: పక్కా గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బిల్లులను కూటమి ప్రభుత్వం చెల్లిస్తోందానని రావూరు సర్పంచ్ ఉడతా వెంకటశేషయ్య ప్రశ్నించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గండ్ల శంకరయ్య, ఎంపీడీఓ నాగేంద్రబాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఇళ్లకు బిల్లులను చెల్లిస్తున్నారని గృహ నిర్మాణ శాఖ ఏఈ సమాధానమిచ్చారు. ఆర్థిక సంవత్సరంలో మండల పరిషత్‌కు ఎంత నిధులొచ్చాయి.. ఏయే పనులు చేశారు.. ఎన్నింటిని పూర్తి చేశారు.. తదితర వివరాలను తెలియజేసేలా సమావేశాన్ని నిర్వహించాలని సర్పంచ్ కోరారు. డిప్యూటీ తహసీల్దార్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.